సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం | 11 | నవంబర్ | 2023



రూ.1.40 లక్షల విరాళం

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో నిత్యాన్నదాన పథకానికి ఓజీ రవితేజారెడ్డి (కడప) శుక్రవారం రూ.1,40,000 విరాళం సమర్పించారు.



ఘనంగా మహాశాంతి హోమం

కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి దివ్య క్షేత్రంలో శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి.

II లో

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: డెల్టా కాలువలకు శుక్రవారం 5,200 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,000, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 3,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

రైతులకు అండగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బోసుబాబు

మండపేట: రైతుల కష్టం దళారుల పాలవకుండా, వారికి అండగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు తెలిపారు. మండపేట సొసైటీలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. తేమశాతం నిర్ధారణ సామగ్రి, గోనెసంచులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా 1.53 లక్షల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేశారన్నారు. వాతావరణం అనుకూలించడంతో పంట ఆశాజనకంగా పండిందన్నారు. ఎకరాకు 35 నుంచి 40 బస్తాల వరకూ ధాన్యం దిగుబడి వస్తున్నట్టు రైతులు చెబుతున్నారని తెలిపారు. మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, ఆలమూరు, రామచంద్రపురం మండలాల్లో వరి కోతలు మొదలయ్యాయని, శుక్రవారం నాటికి 5,200 ఎకరాల్లో పూర్తయ్యాయని చెప్పారు. ధాన్యం సేకరణకు జిల్లా వ్యాప్తంగా 374 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 2.73 లక్షల గోనెసంచులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని, మద్దతు ధర పొందాలని రైతులకు బోసుబాబు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ కె.నాగేశ్వరరావు, ఏఓ కె.ఏసుబాబు, సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, సీఈఓ సీహెచ్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పట్టుబడిన మొసలి.. వాలమూరు వాగులోకి..



వాలమూరు వాగులోకి మొసలిని వదులుతున్న అటవీ సిబ్బంది

అమలాపురం రూరల్: చల్లపల్లి ప్రధాన పంట కాలువలో పట్టుబడిన మొసలిని అటవీ శాఖ అధికారులు వాలమూరు వాగులో సురక్షితంగా విడిచిపెట్టారు. జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాదరావు ఆధ్వర్యాన విశాఖపట్నానికి చెందిన రెస్క్యూ టీం సభ్యులు, మత్స్యకారులు గురువారం రాత్రి ఈ మొసలిని బంధించిన విషయం తెలిసిందే. దానికి మత్తు ఇంజక్షన్ ఇచ్చి, తాళ్లతో బంధించి, వ్యాన్‌లో రాజమహేంద్రవరానికి తరలించారు. అక్కడి నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలానికి తరలించి, వాలమూరు వాగులో శుక్రవారం విడిచిపెట్టారు. జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాదరావు ఈ విషయం తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జూ పార్కు వైద్యుడు ఫణీంద్ర, ఫారెస్ట్ బీటు ఆఫీసర్లు వెంకట రమణ, లోవ ప్రసాద్, బేస్ క్యాంపు ఇన్‌చార్జి రవి పాల్గొన్నారు. మొసలి పీడ వదలడంతో ఈ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

దిగుబడుల దీపావళి

- రైతు కళ్లలో ఆనందకాంతులు
- ఖరీఫ్‌లో సానుకూల పరిస్థితులు
- కలిసొచ్చిన ధాన్యం దిగుబడులు
- ఎకరానికి 35 నుంచి 40 బస్తాలు



సామర్లకోట మండలం జి.మేడపాడులో ధాన్యాన్ని రాశులుగా పోస్తున్న రైతులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రైతు కుటుంబాల్లో దీపావళి వెలుగుల జోష్ కనిపిస్తోంది. ఖరీఫ్ దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో రైతుల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. వర్షాభావ పరిస్థితులను ప్రభుత్వ ప్రోత్సాహంతో అధిగమించారు. సాగు నీరు, విత్తనాలు, ఎరువులను ప్రభుత్వ యంత్రాంగం సకాలంలో అందించడం ఈసారి రైతులకు బాగా కలిసి వచ్చింది. సీజన్ ప్రారంభంలో కొంత ప్రతికూల వాతావరణం కనిపించినా చివరిలో దిగుబడులు ఆశాజనకంగా ఉండటం ఊరటనిచ్చింది. ప్రస్తుతం రైతులు మాసూళ్లలో బిజీగా ఉన్నారు. చేతికంది వచ్చిన పంటను కళ్లాల్లోనే మద్దతు ధరకు అమ్మేస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇటు మెట్ట, అటు డెల్టా అనే తేడా లేకుండా ముందుగా ఊడ్పులు జరిగిన ప్రాంతాల్లో వ్యవసాయ పనులతో సందడి వాతావరణం కనిపిస్తోంది.

కోతలు వేగంగా పూర్తి

ఏటా మాదిరిగానే మెట్ట ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు కొంత ఇబ్బంది కలిగించాయి. అయినా గోదావరి మధ్య, తూర్పు డెల్టాల పరిధిలోని ఆయకట్టు, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లోని మెట్ట ప్రాంత మండలాల్లో ఖరీఫ్ దిగుబడులు ఆశాజనకంగా వస్తున్నాయి. కాకినాడ రూరల్, కరప, సామర్లకోట, పెద్దాపురం, జగ్గంపేట, గోకవరం, గండేపల్లి, ముమ్మిడివరం, కొత్తపేట, మండపేట, రాజమహేంద్రవరం రూరల్, కడియం, అనపర్తి, రాజానగరం, కొవ్వూరు తదితర మండలాల్లో వరి నూర్పిళ్లు వేగంగా జరుగుతున్నాయి. రాజమహేంద్రవరం రూరల్‌లో 50 శాతం పైగా కోతలు పూర్తయ్యాయి. రాజానగరం, అనపర్తి, సీతానగరం, కొవ్వూరు, చాగల్లు మండలాల్లో వరి మాసూళ్లు నాలుగైదు రోజులుగా ముమ్మరంగా సాగుతున్నాయి. కోతలు పూర్తి చేసిన రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టి అటు నుంచి అటే రైతు భరోసా కేంద్రాలకు తరలిస్తున్నారు. మద్దతు ధరకు అమ్ముకుంటున్నారు. గత ఏడాది ఇదే సీజన్‌లో మద్దతు ధర 75 కిలోల బస్తా రూ.1,530. దీనిని రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్‌లో రూ.1,637కు పెంచడంతో గొప్ప మేలు జరుగుతోందని రైతులు సంబరపడుతున్నారు.

ఇక్కడ దీపావళి సెంటిమెంటు

ఖరీఫ్‌లో ముందుగా నాట్లు వేసే మండపేట, రామచంద్రపురం, కొత్తపేట నియోజకవర్గాల్లో ఇప్పటికే వరి కోతలు మొదలయ్యాయి. ఈ మండలాలతో సెంట్రల్ డెల్టాలో రైతులు దీపావళి సెంటిమెంట్‌తో వచ్చే బుధవారం నుంచి మాసూళ్లు ముమ్మరం చేస్తారంటున్నారు. దిగుబడులు బాగుండటం వారికి ఊరటనిస్తోంది. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో ప్రతికూల రైతులను ఆందోళనకు గురిచేస్తున్నా మాసూళ్లకు ధైర్యంగా సిద్ధపడుతున్నారు. వారం పది రోజులు వాతావరణం అనుకూలిస్తే తొలకరి గట్టెక్కుతుందని ఆశ పడుతున్నారు.

పంట కోత ప్రయోగాల లెక్కలు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో క్షేత్ర స్థాయిలో ఇంతవరకూ జరిగిన 180 పంట కోతల ప్రయోగాలు పరిశీలిస్తే ఎకరాకు 35 నుంచి 38 బస్తాల వరకూ దిగుబడి వస్తోందని లెక్కలేశారు. కొన్ని పొలాల్లో 40 బస్తాలు వచ్చే అవకాశముంది. ఈ దిగుబడులు చూసి రైతులు ఆనందపడుతున్నారు. నాట్ల నుంచి మాసూళ్ల వరకూ ఎకరాకు రూ.26,000 నుంచి రూ.28,000 వరకూ పెట్టుబడులు అయ్యాయి. తెగుళ్ల బెడద తక్కువ, వాతావరణం అనుకూలించడంతో దిగుబడి ఆశాజనకంగా ఉంది. 60 శాతం సాగు కౌలు రైతుల చేతుల్లోనే ఉంది. వీరు ఎకరాకు 12, 15 బస్తాలు వంతున కౌలుకు తీసుకున్నారు. కౌలు, పెట్టుబడులు పోను అంటే ఎకరాకు రూ.30 వేలు కొద్దిగా అటుఇటుగా ఆదాయం రావడం ఆనందంగా ఉందంటున్నారు.

వరి సాగు (ఎకరాల్లో), దిగుబడి, సేకరణ లక్ష్యం (మెట్రిక్ టన్నుల్లో)



జిల్లా	సాగు విస్తీర్ణం	దిగుబడి	సేకరణ లక్ష్యం
కాకినాడ	1,83,000	5,50,000	2,60,000
తూర్పు గోదావరి	70,877	4,50,000	3,20,000
కోనసీమ	1.58,000	4,10,000	3,81,000

కలిసొచ్చిన వాతావరణం



వాతావరణం అనుకూలించడం కలిసొచ్చింది. మునుపటి కంటే తెగుళ్లు బాగా తగ్గాయి. పెట్టుబడులు పెరిగినా పంట బాగా పండింది. గత ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే దిగుబడి బాగా పెరిగింది. ఎకరాకు 35 నుంచి 40 బస్తాల దిగుబడి వస్తోంది. ఇంత వస్తుందని అనుకోలేదు. మాసూళ్లు చేసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయడంతో ఊరటగా ఉంది. రైతుభరోసా కేంద్రాలు చొరవతో పని చేస్తున్నాయి.

– అన్నందేవుల చంద్రరావు, చైర్మన్, ఆర్‌బీకే మండల కమిటీ, కేశవరం, మండపేట

తొలకరి ఆశాజనకం



తొలకరి పంట ఆశాజనకంగా ఉంది. సీజన్ ఆరంభంలోను, సాగునీటి ఇబ్బందులు ఎదురైనా ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చొరవతో సాగునీటి కష్టాలు తప్పాయి. కూలి రేట్ల నుంచి ఎరువులు, పురుగు మందుల రేట్లు పెరిగిపోవడంతో సార్వా పెట్టుబడులు పెరిగిపోయాయి. ఇంతవరకూ ఎకరాకు రూ.28 వేల పెట్టుబడి పెట్టాం. కోతలు, మాసూళ్లకు మరో రూ.ఐదారు వేలు అవుతుంది. ఎకరాకు 30 నుంచి 40 బస్తాల దిగుబడి వస్తుంది. హమాలీలు, రవాణా చార్జీలు కూడా ప్రభుత్వమే చెల్లిస్తూండటం సంతోషంగా ఉంది.

– రెడ్డి వీరభద్రరావు, రైతు, కరప



మండపేటలో కళ్లాల నుంచే ధాన్యం బస్తాలను ట్రాక్టర్లపై తరలిస్తోన్న రైతులు

14 నుంచి జాతీయ సహకార వారోత్సవాలు



సహకార వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అఖిల భారత సహకార వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ ఆకుల వీర్రాజు తెలిపారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో సహకార వారోత్సవాల పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లాలో సహకార వారోత్సవాలను విధిగా నిర్వహించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన రైతు సంక్షేమ కార్యక్రమాలు, సహకార బ్యాంకులు ఇస్తున్న రుణాలు, రాయితీలపై అవగాహన కల్పించాలని సూచించారు. రామదాసు సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈ నెల 14న ఉమ్మడి జిల్లాలోని అన్ని సహకార సంస్థల్లో సహకార పతాకాలు ఆవిష్కరించాలన్నారు. అదే రోజు కాకినాడ డీసీసీబీలో చైర్మన్ ఆకుల వీర్రాజు సహకార వారోత్సవాలు ప్రారంభిస్తారన్నారు.

ఉపాధి హామీ పనుల్లో నాణ్యత

సామర్లకోట: ఉపాధి హామీ పనుల్లో మరింత నాణ్యత పెరిగే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని డ్వామా అదనపు కమిషనర్ అశోక్‌కుమార్ అన్నారు. డ్వామా రాష్ట్ర స్థాయి రీసోర్సు పర్సన్లకు స్థానిక విస్తరణ, శిక్షణ కేంద్రంలో మూడు రోజుల శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకంలో ప్రజలకు, రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించాలని సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఉపాధి హామీ నిధుల్లో 50 శాతం కేటాయించే ముఖ్యమైన పనులను గుర్తించాలన్నారు. అధికారులు తరచూ ఉపాధి పనులను పర్యవేక్షించాలని, మస్తర్లను పరిశీలించాలని అన్నారు.

వచ్చే నెల 15 నుంచి 'ఆడుదాం ఆంధ్ర'

- జనవరి 26 వరకూ నిర్వహణ
- విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ నుపూర్ అజయ్

అమలాపురం రూరల్: జిల్లావ్యాప్తంగా ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా వచ్చే నెల 15 నుంచి జనవరి 26వ తేదీ వరకూ 'ఆడుదాం ఆంధ్రా' పేరిట క్రీడా సంబరాలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ క్రీడా సంబరాల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న.. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి 26 జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ, ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాల నిర్వహణకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఏర్పాట్లు చేస్తోందన్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో పోటీల నిర్వహణకు ముమ్మరంగా సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పారు. పదిహేనేళ్లు పైబడిన బాలబాలికలు ఈ క్రీడలకు అర్హులన్నారు. ఈ పోటీలకు గ్రామ, వార్డు సచివాలయ స్థాయి నుంచి క్రీడాకారులను ఆహ్వానిస్తున్నామన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ మొత్తం ఐదు దశల్లో 42 రోజుల పాటు ఈ క్రీడా పోటీలు జరుగుతాయని వివరించారు. ఈ పోటీల్లో ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొనరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. క్రీడాకారుల నమోదు ప్రక్రియను ఈ నెల 20న వలంటీర్లు చేపడతారన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఈ నెల 21న క్రీడా కిట్లు పంపిణీ చేస్తారని, 22న స్కోరింగ్ యాప్ చెకింగ్ ఉంటుందని, 25న వలంటీర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి క్రీడల నిర్వహణపై కరపత్రాలతో అవగాహన కల్పిస్తారని వివరించారు. జిల్లావ్యాప్తంగా 467 గ్రామాలు, 48 వార్డుల్లో ఈ క్రీడా సంబరాలు జరుగుతాయన్నారు. క్రీడల నిర్వహణకు ప్రతి సచివాలయం నుంచి పది మంది వలంటీర్లను ఎంపిక చేసి, జిల్లావ్యాప్తంగా మొత్తం 5,150 మందికి శిక్షణ ఇస్తామని తెలిపారు. క్రీడా సంబరాలను విజయవంతం చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు సురేష్ కుమార్, ఆడుదాం ఆంధ్ర ముఖ్య కార్యనిర్వహణాధికారి, చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు రాజు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

- ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ
- విద్యార్థులకు వివిధ పోటీలు



గ్రంథాలయంలో చదువుతున్న పాఠకులు

రాయవరం: గ్రంథాలయాలపై అవగాహన కల్పించడం, పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ నెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గ్రంథాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు పది విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాలయాలకు వెళ్లి అవగాహన కల్పించనున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 101 గ్రంథాలయాలున్నాయి. కాకినాడలోని జిల్లా గ్రంథాలయంతో పాటుగా గ్రేడ్-1 గ్రంథాలయాలు 6, గ్రేడ్-2 లైబ్రరీలు 10, గ్రేడ్-3 (శాఖా గ్రంథాలయాలు) 85 ఉన్నాయి. వీటిల్లో పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని పుస్తకాలూ అందుబాటులో ఉంచుతున్నారు. ఇవి చదువుకుంటూనే చాలా మంది గ్రూప్-1, గ్రూపు-2, సివిల్స్ వంటి పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులవుతున్నారు. 'రీడర్ ఆన్ డిమాండ్' పేరుతో కూడా పుస్తకాలు అందిస్తున్నారు. గ్రంథాలయాలను డిజిటలైజ్ చేస్తున్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వీటన్నింటిలోనూ పోటీలు, ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులను జూనియర్, సీనియర్లుగా విభజిస్తారు. వీరికి వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, కథలు, ఆటలు, క్విజ్, పాటలు, డ్యాన్సులు, కంప్యూటర్, పుస్తక పఠనం తదితర పోటీలు నిర్వహిస్తారు. ఎటువంటి ముందస్తు నమోదూ లేకుండానే నేరుగా పోటీలకు హాజరు కావచ్చు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాల్లో జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందిస్తారు. గత వేసవిలో నిర్వహించిన శిక్షణ శిబిరాలు, ప్రస్తుత గ్రంథాలయ వారోత్సవాలకు కలిపి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసింది.

అవగాహన కల్పిస్తున్నాం



గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను రాష్ట్ర స్థాయికి పంపిస్తాం.

– వీఎల్ఎస్‌వీ ప్రసాద్, సెక్రటరీ, జిల్లా గ్రంథాలయ సంస్థ, కాకినాడ

వారోత్సవాలు నిర్వహిస్తారిలా..

తేదీ	కార్యక్రమం
14	వారోత్సవాలు ప్రారంభం, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ
15	పుస్తక ప్రదర్శన, పఠనం, మత్తు పదార్థాల నివారణపై అవగాహన
16	గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేసిన వారి చరిత్రలను తెలియజేయడం
17	కవి సమ్మేళనం, రచయితల పరిచయం
18	చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, ఇండోర్ క్రీడలు
19	దిశ యాప్ వినియోగం, మహిళాభివృద్ధిపై అవగాహన సదస్సులు
20	డిజిటల్ గ్రంథాలయాలు, నచ్చిన పుస్తకం చదవడం, ముగింపు కార్యక్రమం

క్లుప్తంగా

325 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం


రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

పి.గన్నవరం: అక్రమంగా తరలిస్తున్న రూ.1.63 లక్షల విలువైన 325 కిలోల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాజోలు మండలం ములికిపల్లికి చెందిన మినీ వ్యాన్ యజమాని పి.కృష్ణార్జునరావు.. కడలి, జగ్గన్నపేట ప్రాంతాల్లో రేషన్ కార్డుదారుల నుంచి ఈ బియ్యాన్ని కిలో రూ.20కి కొనుగోలు చేసి, పి.గన్నవరం పరిసర ప్రాంతాల్లోని ఇటుక బట్టీల కార్మికులకు రూ.24 చొప్పున విక్రయిస్తున్నాడు. ఇదేవిధంగా శుక్రవారం బియ్యం తరలిస్తుండగా నాగుల్లంక వద్ద ఆ మినీ వ్యాన్‌ను అధికారులు పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న కృష్ణార్జున రావు, డ్రైవర్ సీహెచ్ రమేష్‌పై కేసు నమోదు చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతోందని రీజినల్ విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీ కె.కుమార్ తెలిపారు. రేషన్ బియ్యం కొన్నా, అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ నాగవెంకటరాజు, తహసీల్దార్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల..కసి..కలగలసి..

మంచి ప్యాకేజీతో వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కాదనుకున్నాడు. ప్రభుత్వ రంగంలో ప్రజాసేవతో వీలున్న కొలువు కావాలనుకున్నాడు. వరుస పరాజయాలు ఎదురైనా ధిక్కరించాడు. లక్ష్య సాధనకు పరాక్రమించాడు. ఏ దశలోనూ నిరాశను దరి చేరనీయరాదనుకున్నాడు. ఆత్మవిశ్వాసమే మార్గమని విశ్వసించాడు. ఫలితంగా ఈ ఏడాది నాలుగు నెలల వ్యవధిలో నాలుగు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. చివరకు గ్రూప్–1 ద్వారా డీఎస్పీ ఉద్యోగంలో చేరాలని నిర్ణయించుకున్నాడు ఓ హెడ్ కానిస్టేబుల్ కుమారుడు చుక్కల సూర్యకుమార్. అయినప్పటికీ అంతిమ లక్ష్యం .. సివిల్స్‌పై గురి వీడలేదు. నిరంతర పరిశ్రమకు చిరునామాగా నిలిచే సూర్యకుమార్‌ను ఒకసారి పలకరిస్తే..

– సాక్షి డెస్క్, రాజమహేంద్రవరం



పేరు	: చుక్కల సూర్యకుమార్
తండ్రి	: వెంకటరమణ, హెడ్ కానిస్టేబుల్
తల్లి	: లక్ష్మి, గృహిణి
చదువు	: బీటెక్ (ట్రిపుల్ ఐటీ, నూజివీడు)
ఎంపిక	: గ్రూప్–1లో డీఎస్పీ (జైళ్లు)
ప్రస్తుతం ఉంటున్నది	: వేమగిరి (తూర్పు గోదావరి)

- డీఎస్పీగా ఎంపికైన హెడ్ కానిస్టేబుల్ కుమారుడు
- వరుస వైఫల్యాలను అధిగమించి సాధించిన వైనం
- ఈ ఏడాది నాలుగు నెలల్లో నాలుగు కొలువులు
- అయినా సివిల్స్ లక్ష్యంగా శ్రమిస్తున్న యువకుడు

మాది మధ్య తరగతి కుటుంబం. సొంత ఊరు కాకినాడ జిల్లా తొండంగి మండలం పైడికొండ. నాన్న వెంకట రమణ కడియం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్. అమ్మ లక్ష్మి గృహిణి. తమ్ముడు గోవిందరాజు, అక్క స్వాతి ఉన్నారు. తమ్ముడు ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదివి ప్రస్తుతం ఢిల్లీ ఎయిమ్స్‌లో గ్యాస్ట్రో ఎంట్రాలజీలో సూపర్ స్పెషాలిటీ చేస్తున్నాడు. నాకు టెన్త్‌లో మంచి మార్కులొచ్చాయి. స్టేట్‌లో ఆరో ర్యాంకు వచ్చింది. ఆ మార్కులు ఆధారంగా 2008లో నూజివీడులోని ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. అక్కడ నా చదువుకు గట్టి పునాది పడింది. ఇంటర్‌లో కూడా స్టేట్ సెకండ్ ర్యాంక్ వచ్చింది. యూనివర్సిటీ స్థాయిలో టాప్ టెన్‌లో ఒకడిగా నిలిచాను. 2014లో బీటెక్ అయ్యాక ఇన్ఫోసిస్ ఉద్యోగానికి క్యాంపస్‌లో సెలక్టయ్యాను. అప్పట్లోనే నాకు వార్షిక జీతం రూ.35 లక్షలు. అందులో కొనసాగి ఉంటే ఇప్పుడు రూ.కోటిన్నరకు చేరేవాడిని.

త్రుటిలో చేజారిన అవకాశాలు

ఎక్కువ జీతం.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నాకు సంతృప్తి కలిగించలేదు. అందులో సంతోషంతో ఇమడలేకపోయాను. రెండేళ్లు పని చేశాను. కానీ పబ్లిక్ సర్వీసుతో సంబంధమున్న ప్రభుత్వ ఉద్యోగం చేయాలనే కోరిక నాలో బలంగా నాటుకుపోయింది. ఇదే విషయాన్ని నాన్నతో చెప్పాను. ఆ ఉద్యోగానికి రాజీనామా చేశాను. మా కుటుంబ ఆర్థిక పరిస్థితులకు ఇది ఇబ్బందికరమైనా నాన్న నన్ను ప్రోత్సహించారు. ఢిల్లీలో సివిల్స్ కోచింగుకు జాయినయ్యాను. 2017–20 మధ్య నాలుగుసార్లు రాశాను. ఇంటర్వ్యూ దశకు చేరుకోలేకపోయాను. ఇదే సమయంలో ఇతర పోటీ పరీక్షలపై దృష్టి పెట్టాను. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్, ఎస్సెస్సీ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్షల్లో తుది జాబితాలో మిస్సయ్యాను. 2020 గ్రూప్–2లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో అవకాశం పోయింది. అదే ఏడాది గ్రూప్–1 మెయిన్స్‌కు అర్హత సాధించినా ఇంటర్వ్యూ పోయింది. ఎస్సెస్సీ సీజీఎల్, నాబార్డు, ఆర్‌బీఐ.. ఇలా నాలుగైదు పరీక్షలు పాసైనా త్రుటిలో విజయం దూరమయ్యేది. ఈ దశలో మానసిక దృఢత్వం కోల్పోతానేమోనని సంశయించాను. అయినా పట్టుదలతో కష్టపడేవాడిని. నిరాశ చెందేవాడిని కాదు.

అంతిమ లక్ష్యం సివిల్స్

2023– ఈ ఏడాది నా జీవితంపై చాలా మంచి ప్రభావం చూపించింది. వరుస వైఫల్యాల నుంచి గట్టెక్కించేలా చేసింది. నాలుగు నెలల వ్యవధిలో నాలుగు ఉద్యోగాలు వచ్చాయి. దేవదాయ శాఖలో ఈఓ పోస్టుకు ఎంపికయ్యాను. కాగ్ అకౌంటెంటుగా సెలక్టయ్యాను. సరదాగా రాసిన గ్రూప్–4 ఉద్యోగమూ వచ్చింది. గ్రూప్–1లో విజేతగా నిలిచాను. జైల్స్ డీఎస్పీగా ఎంపికయ్యాను. ప్రస్తుతానికి దేవదాయ శాఖలో ఈఓ శిక్షణ పొందుతున్నా.. వచ్చే జనవరిలో డీఎస్పీ ట్రైనింగ్ ఆర్డర్ రాగానే వెళ్లాలని నిర్ణయించుకున్నాను. డీఎస్పీ అయినా నా జీవిత లక్ష్యం మాత్రం సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావాలన్నదే. ఎలాగైనా సాధిస్తానని నమ్మకం ఉంది.


కుటుంబ సభ్యులతో సూర్య కుమార్

లక్ష్యం నిర్ణయించుకుని శ్రమించాలి

జీవితంలో ఏం చేయాలనుకుంటున్నామో మన సామర్థ్యానికి అనుగుణంగా ముందుగానే లక్ష్యం నిర్ణయించుకోవాలి. ఏదైనా సాధించాలంటే కష్టం తప్ప మరో మార్గం ఉండదని తెలుసుకోవాలి. ఒడుదొడుకులు ఎదురైనా ఏ సమయంలోనూ ఆత్మ విశ్వాసాన్ని దూరం చేసుకోకూడదు. నేనైతే ఈ పరీక్షల ప్రిపరేషనులో అన్ని సరదాలు, షికారులు వదులుకున్నాను. ఫెయిల్యూర్స్ వస్తున్నా నిరాశ పడకుండా ప్రయత్నం కొనసాగించాలి. ప్రణాళిక ప్రకారం ప్రిపేరైతే తప్పకుండా విజయం సాధిస్తాం.

– చుక్కల సూర్యకుమార్

25 టన్నుల బియ్యం పట్టివేత

కొవ్వూరు: అక్రమంగా తరలిస్తున్న 25 టన్నుల రేషన్ బియ్యాన్ని స్థానిక గామన్ ఇండియా టోల్ గేటు వద్ద అధికారులు గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ జి.బాపిరాజు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణలోని ఖమ్మం నుంచి కాకినాడ పోర్టుకు లారీలో భారీగా రేషన్ బియ్యం తరలిస్తున్నారు. దీనికి సంబంధించి ఎటువంటి ఆధారాలూ చూపకపోవడంతో బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, నిడదవోలులోని పౌర సరఫరాల గోదాముకు తరలించారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా వత్సవాయి మండలం లింగాల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కం ఓనర్ షేక్ నాగూర్ మీరా, బియ్యం పంపిన వ్యాపారి ఖమ్మం నగరానికి చెందిన ఎ.వెంకటేశ్వరరావుపైన 6ఏ కేసు నమోదు చేశారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.10 లక్షలు ఉంటుందని నిర్ధారించారు. లారీతో కలిపి పట్టుకున్న సొత్తు రూ.23 లక్షలని బాపిరాజు తెలిపారు.

ఘనంగా మహాశాంతి హోమం


మహాశాంతి హోమంలో పాల్గొన్న ప్రముఖులు


స్వామి వారి చక్రస్నానంలో భక్తుల కోలాహలం

- కోలాహలంగా చక్రస్నానం
- వాడపల్లిలో ముగిసిన వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

ఆత్రేయపురం: పావన గౌతమీ గోదావరి తీరాన కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి దివ్యక్షేత్రంలో శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ నెల 2న ఈ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగానే వాడపల్లిలో కూడా ఏటా స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల చివరి రోజైన శుక్రవారం ఉదయం స్వామి వారికి తీర్థపు బిందె, సుప్రభాత సేవ, నిత్యహోమాలు, ప్రత్యేక పూజలు, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మహా శాంతి హోమం, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, అవభృధ స్నానం, ధ్వజారోహణ.. సాయంత్రం మహదాశీర్వచనం, ఏకాంత సేవ తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారికి ప్రముఖ పారిశ్రామికవేత్త మేడపాటి శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు పట్టు వస్త్రాలు అందజేశారు. కుటుంబ సమేతంగా హోమం పూర్ణాహుతిలో పాల్గొని, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. బ్రహోత్సవ క్రతువులను ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యాన వేద పండితులు, అర్చకులు నిర్వహించారు. స్వామి వారిని పట్టు వస్త్రాలు, రంగురంగుల పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి భక్తులు ఆర్జిత సేవలు నిర్వహించుకున్నారు.


స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

చొల్లంగిలో రోడ్డు ప్రమాదం

- ఆటోను ఢీకొన్న కారు
- ఆ కారును ఢీకొన్న మరో ఆటో
- 14 మందికి గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216పై చొల్లంగి వద్ద శుక్రవారం జరిగిన ప్రమాదంలో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, కోరంగి పోలీసుల కథనం ప్రకారం.. అమలాపురం నుంచి కాకినాడ వైపు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. అదే సమయంలో కాకినాడ వైపు నుంచి చొల్లంగిపేట వెళ్తున్న మరో ఆటో ఆ కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు ఆటోల డ్రైవర్లతో పాటు ఆయా ఆటోల్లోని 10 మంది ప్రయాణికులు, కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. తాళ్లరేవు మండలం చొల్లంగిపేటకు చెందిన ఆటో డ్రైవర్లు ఈర్ల బాబూరావు, తులసి శ్రీనివాసరావుతో పాటు కోనాడ కామేశ్వరి, శ్రీకోటి లక్ష్మి, కోనాడ సత్యవతి, నీలపల్లి లక్ష్మి, రామిశెట్టి ఎల్లారి, సోది పద్మ, నీలపల్లి దేవి, గంపల నూకరత్నం; తాళ్లరేవుకు చెందిన మేకల కస్తూరి, మేకల ఆనంద్; కారులో ప్రయాణిస్తున్న దొంగ రామచంద్రరావు, సునీత దంపతులు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్సులలో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

చేపల విక్రయానికి వెళ్లి వస్తూ..

చొల్లంగిపేట గ్రామానికి చెందిన మహిళలు ప్రతి రోజూ మత్స్య ఉత్పత్తుల విక్రయానికి ఆటోల్లో సామర్లకోట, పెద్దాపురం వెళ్లి వస్తుంటారు. రోజూ మాదిరిగానే ఒకే ఆటోలో వెళ్లిన ఎనిమిది మంది మత్స్యకార మహిళలు తిరిగి స్వగ్రామానికి తిరిగి బయలుదేరారు. మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఏడాది మే నెలలో కోరంగి పంచాయతీ సుబ్బారాయుని దిమ్మ వద్ద ఒక ఆటోను ప్రైవేటు బస్సు ఢీకొని ఎనిమిది మంది మృతి చెందిన విషయం తెలిసిందే. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా ఆటోవాలాల తీరు మారకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులు తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


చొల్లంగి వద్ద ఆటోను ఢీకొన్న కారు

రాష్ట్ర స్థాయికి ప్రాజెక్టుల ఎంపిక


మండపేట విద్యార్థినులను అభినందిస్తున్న డీఈఓ కమలకుమారి తదితరులు


రాష్ట్రస్థాయికి ఎంపికై, షీల్డ్ అందుకుంటున్న మోడేకుర్రు విద్యార్థులు, గైడ్ టీచర్ మురళి

మండపేట/కొత్తపేట: జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనలో విద్యార్థులు తమ ప్రతిభతో మెరిశారు. అమలాపురంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూలులో ఇటీవల ఈ పోటీలు జరిగిన విషయం తెలిసిందే. ఇందులో మండపేట, కొత్తపేట మండలం మోడేకుర్రు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. వీరిని డీఈఓ ఎం.కమలకుమారి, జిల్లా సైన్స్ అధికారి జీవీస్ సుబ్రహ్మణ్యం తదితరులు అభినందించారు. మండపేట గౌతమీ మున్సిపల్ స్కూల్ విద్యార్థులు లావణ్య, స్పందన సరికొత్త ఆలోచనను ఆవిష్కరించారు. పండ్ల తొక్కలు, ఆహార పదార్థాల వ్యర్థాల నుంచి ఇంట్లో దుస్తులు, టాయిలెట్స్, ఫ్రిజ్ తదితర గృహోపకరణాలు శుభ్రపరచుకునేందుకు అవసరమైన రసాయనాలు తయారు చేయడంపై వారు ఈ ప్రాజెక్టు రూపొందించారు. వారికి జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు మేకా రామలక్ష్మి గైడ్‌గా వ్యవహరించారు. ఈ ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్ శోభావళి శుక్రవారం ఈ విషయం తెలిపారు. అలాగే, మోడేకుర్రు జెడ్పీ హైస్కూలులో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు జీహెచ్‌డీవీ సాయి, పి.ఉదయ్ శ్రీనివాస్‌లు 'నో యువర్ ఎకో సిస్టమ్' అనే అంశంలో ప్రాజెక్టు రూపొందించారు. ఇది కూడా రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ విద్యార్థులకు వి.మురళీకృష్ణారావు గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. వీరిని సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి, పాఠశాల కమిటీ చైర్మన్ బండి ధనశేఖర్, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి శ్రీనివాస్, ఎ.నాగలక్ష్మి, ఎంఈఓ–1, 2లు ఎం.హరిప్రసాద్, కె.లీలావతి, హెచ్‌ఎం వీవీఎస్ రామచంద్రమూర్తి తదితరులు అభినందించారు.